క్లుప్తంగా

అడ్మిషన్లు పెరగడం ఆనందకరం



అధ్యాపకులతో మాట్లాడుతున్న డీఐఈఓ రవీందర్‌రెడ్డి

జగదేవ్‌పూర్(గజ్వేల్): గతేడాది కంటే ఈ యేడాది అడ్మిషన్లు పెరగడం ఆనందకరంగా ఉందని జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాధికారి రవీందర్‌రెడ్డి అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలను శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తమ ఫలితాలు సాధించేలా విద్యను అభ్యసించాలన్నారు. ఇంటర్ విద్య కమిషనర్ సూచన మేరకు విద్యార్థులకు ఎఫ్ఆర్ఎస్ హాజరు ఏర్పాటు చేశామని చెప్పారు. కళాశాలలో నిర్వహిస్తున్న క్రీడలను తిలకించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజన్న, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎర్రవల్లిలో కబడ్డీ శిక్షణ



శిక్షణను ప్రారంభిస్తున్న సంతోష్ గుప్తా

మర్కూక్(గజ్వేల్): జిల్లా స్థాయిలో గెలుపొందిన క్రీడాకారులకు మండలంలోని ఎర్రవల్లిలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ఆరురోజుల శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు సంతోష్ గుప్తా మాట్లాడుతూ ఇటీవల జిల్లా స్థాయిలో గెలుపొందిన 24 మంది బాలురు, 24 మంది బాలికలకు శిక్షణ ఇస్తారన్నారు. వారు 25న నిజామాబాద్ జిల్లాలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో శివకుమార్, సత్యం, మహేశ్, భిక్షపతి, బాల్‌రాజు, కృష్ణ, కిష్టారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, స్వామి, మల్లేశం, పరశురాములు, రాముల్రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కుక్కల నియంత్రణకు చర్యలు



కుక్కను వాహనంలోకి ఎక్కిస్తున్న సిబ్బంది

దుబ్బాకటౌన్: వీధికుక్కలను నియంత్రించడానికి చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ రమేశ్‌కుమార్ చెప్పారు. సిద్దిపేటకు చెందిన జంతు సంరక్షణ సిబ్బందితో శనివారం వీధి కుక్కలను పట్టించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని వీధికుక్కలను విడతలవారీగా పట్టుకొని సిద్దిపేటలోని యానిమల్ బర్త్ కేర్ సెంటర్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు, వ్యాక్సినేషన్ ఇచ్చాక వాటిని దుబ్బాకకు తీసుకువచ్చి వదిలేస్తామని చెప్పారు.

పంట నమోదును ప్రారంభించండి: సీపీఐ



మాట్లాడుతున్న శివరాజ్

హుస్నాబాద్: ఖరీఫ్ సీజన్ పంట నమోదును వెంటనే ప్రారంభించాలని సీపీఐ నియోజకవర్గ నాయకుడు శివరాజ్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సీజన్ ప్రారంభమై నాలుగు నెలలు గడుస్తున్నా వ్యవసాయ అధికారులు పంట నమోదు చేయకపోవడం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పంట నమోదు చేస్తేనే వరి, మొక్కజొన్న, పత్తి తదితర పంటలను ప్రభుత్వ సంస్థలకు అమ్ముకోవడానికి అస్కారం ఉంటుందని, వెంటనే అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో నాయకులు రాజు నాయక్, వినోద్‌రావు, నవీన్, హరీశ్ పాల్గొన్నారు.

బతుకమ్మ ఏర్పాట్లపై అఖిలపక్ష సమావేశం

హుస్నాబాద్: బతుకమ్మ ఏర్పాట్లపై మంత్రి క్యాంపు కార్యాలయంలో శనివారం అఖిలపక్ష నాయకుల సమన్వయ సమావేశం నిర్వహించారు. చిన్న బతుకమ్మ, సద్దుల బతుకమ్మ, దసరా పండుగ ఉత్సవాల ఏర్పాట్ల గురించి వారు చర్చించారు. నాయకుల సలహాలు, సూచనలను తీసుకున్నారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఇరుకు గల్లీలతో ఇబ్బందులు

నిధులు మంజూరైనా అభివృద్ధి శూన్యం
- ఆగిపోయిన రోడ్ల విస్తరణ
- అధ్వానంగా డ్రైనేజీలు
- చెత్త సేకరణకు తప్పని తిప్పలు



17వ వార్డులో ఇరుకైన గల్లీ

దుబ్బాకటౌన్: దేవుడు వరమిచ్చినా.. పూజారి కరుణించడు.. అన్నట్లుంది పలు వార్డుల పరిస్థితి. పంచాయతీ నుంచి నగర పంచాయతీగా, తర్వాత మున్సిపల్‌గా మార్పు చెందింది దుబ్బాక. కాని అభివృద్ధిలో మాత్రం అనుకున్నంతగా లేదనే అసహనం వ్యక్తమవుతోంది.

చెత్త సేకరణకు ఇబ్బందే..

గల్లీ చిన్నది గరిబోళ్ల కథ పెద్దది అనే పాటలో లాగానే పట్టణంలోని 17వ వార్డులో కొన్ని చోట్ల ఇరుకైన గల్లీలతో ప్రజలు నానావస్థ పడుతున్నారు. ప్రతిరోజు చెత్త సేకరించడానికి కనీసం ఆ వాహనం కూడా గల్లీలోకి వెళ్లేపరిస్థితి లేదు. అలాగే అత్యవసర సమయంలో అంబులెన్సు కూడా రాలేని దుస్థితి నెలకొంది.

అసంపూర్తిగా డ్రైనేజీల నిర్మాణం

కొన్ని వార్డులల్లో డ్రైనేజీలు అధ్వానంగా తయారయ్యాయి. ఒక్కచోట డ్రైనేజీలను పునర్నిర్మించినా మరికొన్నింటిని పట్టించుకోలేదు. దీంతో వర్షాకాలంలో ప్రజలు కష్టాలు వర్ణణాతీతం.

ఇళ్లను కూల్చి యేళ్లు గడుస్తున్నా..

తెలంగాణ తల్లి సర్కిల్ సమీపంలో ఇరుకైన గల్లీని వెడల్పు చేసేందుకు మూడేళ్ల క్రితమే నిధులు మంజూరు చేశారు. గతంలోనే స్థానిక కౌన్సిలర్ పలు కుటుంబాలతో మాట్లాడి రోడ్డు వెడల్పుకు సహకరించేలా చర్యలు తీసుకున్నారు. అయినా అభివృద్ధికి మాత్రం నోచుకోవడం లేదు.

రోడ్డు నిర్మించండి..



ఇరుకైన గల్లీలతో అవస్థలు పడుతున్నాం. గతంలో మా నాన్న అనారోగ్యం బారిన పడితే అత్యవసర సమయంలో అంబులెన్స్ రాకపోతే మోసుకు వెళ్లాల్సివచ్చింది. చెత్త సేకరణ బండి కూడా వచ్చే వీలు లేదు. అధికారులు స్పందించి రోడ్డు నిర్మించాలి.

– కారంకంటి రాజు, 17 వార్డు

కాంట్రాక్టర్‌కు నోటీసులు ఇచ్చాం



17వార్డు అభివృద్ధికి గతంలోనే రూ.10 లక్షల నిధులు మంజూరయ్యాయి. రోడ్డు వెడల్పు చేసేందుకు కొందరు సహకరించకపోవడం వల్ల నిర్మాణం ఆలస్యమైంది. తర్వాత కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వహించాడు. దీంతో అతడికి నోటీసులు జారీచేశాం. త్వరలో పనులు చేపట్టి సమస్య పరిష్కరిస్తాం.

– రమేశ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్, దుబ్బాక

ఊరచెరువు ముంపు నివారణకు చర్యలేవి?

గజ్వేల్‌లో బీజేపీ నేతల రాస్తారోకో



ప్రధాన రహదారిపై బీజేపీ నేతల రాస్తారోకో

గజ్వేల్: గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో ఊరచెరువు ముంపు నివారణ చర్యలు వెంటనే చేపట్టాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో శనివారం ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ప్రతియేటా ఊరచెరువు నుంచి వస్తున్న వరద నీటి వల్ల పారిపేశ్వర ఆలయం పక్కనున్న కాలనీ, ప్రధాన రహదారి జలదిగ్బంధమై రోజుల తరబడి రాకపోకలు నిలిచిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మున్సిపల్ మాజీ చైర్మన్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు మనోహర్ మాట్లాడుతూ కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల నిర్లక్ష్యం వల్లే ఈ సమస్య జటిలంగా మారిందన్నారు. అధికారులు ఇప్పటికైనా ఈ సమస్యపై స్పందించాలని డిమాండ్ చేశారు. సీఐ రవికుమార్ సంఘటనా స్థలానికి చేరుకొని ఆందోళనకారులకు నచ్చజెప్పి రాస్తారోకోను విరమింపజేశారు. బీజేపీ నేతలు రాములు, శ్రీను, శివకుమార్, రమేశ్, వెంకట్‌రెడ్డి, బోస్, రామచంద్రాచారి తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



దుబ్బాకటౌన్: మాట్లాడుతున్న చంద్రకళ

దుబ్బాకటౌన్/మిరుదొడ్డి(దుబ్బాక): పౌష్టికాహారంతోనే గర్భిణులు, పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు చంద్రకళ, రేణుక అన్నారు. పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా శనివారం దుబ్బాక, మున్సిపల్ పరిధిలోని చెల్లాపూర్ అంగన్‌వాడీ కేంద్రాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రకళ మాట్లాడుతూ గర్భిణులు ప్రతిరోజు మూడుసార్లు తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. రక్తహీనత సమస్యకు ఐరన్ మాత్రలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సుజాత, శిరీష తదితరులు పాల్గొన్నారు. అలాగే మిరుదొడ్డి మండలం చెప్యాల రెండో అంగన్‌వాడీ కేంద్రంలో సూపర్‌వైజర్ రేణుక మాట్లాడుతూ ఆరోగ్య లక్ష్మి పథకం ద్వారా గర్భిణులు, బాలింతలు, తల్లులకు అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం వారితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సుజాత, లక్ష్మి, కరుణలక్ష్మి, షభానా తదితరులు పాల్గొన్నారు.

పేదల బతుకులతో చెలగాటం వద్దు

ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు రాజుమాదిగ

ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చాలని కోరుతూ ఎమార్పీఎస్ ఆధ్వర్యంలో పెన్షన్‌దారులు నిరసన, ధర్నాలు నిర్వహించారు.



దుబ్బాక మున్సిపల్ కార్యాలయం ఎదుట పెన్షన్‌దారుల ధర్నా

దుబ్బాక/మద్దూరు(హుస్నాబాద్)/ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)/బెజ్జంకి(సిద్దిపేట)/జగదేవ్‌పూర్(గజ్వేల్): ప్రభుత్వం ఎన్నికల ముందు దివ్యాంగులు, చేయూత పెన్షన్‌దారులందరికి ఫించన్లు పెంచుతామని హామినిచ్చి పట్టించుకోక పోవడం దారుణమని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ముక్కపల్లి రాజుమాదిగ ఆవేదన వ్యక్తం చేశారు. పెన్షన్‌దారులు శనివారం దుబ్బాక మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడించి మహాధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే దివ్యాంగులకు రూ.6 వేలు, మిగతావారికి రూ.4వేలు చొప్పున పెంచుతామని చెప్పి ఇప్పటి వరకు చర్యలు చేపట్టలేదన్నారు. అనంతరం కమిషన్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు కనకరాజు, షాదుల్, జోగయ్య, శేఖర్, ప్రశాంత్ కుమార్, లక్ష్మీనర్సయ్య, నసీమ, కుమార్ తదితరులు పాల్గొన్నారు. మద్దూరు మండలం దూల్మిట్ట పంచాయతీ కార్యాలయం వద్ద ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు సుందరగిరి భాస్కర్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి సిద్దేశ్వర్ వినతిపత్రం అందజేశారు. సిద్దిపేట రెండో వార్డులో కౌన్సిలర్ నాయిని చంద్రంకు మాదిగ రిజర్వేషన్ సమితి ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. బెజ్జంకిలో ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జి పరశురాములు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్యదర్శి ప్రణీత్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. పరశురాములు, చంద్రయ్య, రఘు, రాములు, పోచమల్లు తదితరులు పాల్గొన్నారు. జగదేవ్‌పూర్ దేవానందం మాట్లాడారు. ఆయా గ్రామాల దివ్యాంగులు, పింఛన్‌దారులు పాల్గొన్నారు.

పంటల నమోదు ప్రారంభించాం

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని డిజిటల్ క్రాప్ బుకింగ్ ద్వారా పంట నమోదు చేస్తున్నామని ఏఓ వసంతరావు చెప్పారు. మండలంలోని గొల్లపల్లిలో నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో రైతులు సాగు చేసిన పంట వివరాలను ఏఈఓలకు ఇచ్చిన యాప్‌లో నమోదు చేసుకోవాలని కోరారు. పత్తి వేసిన రైతులు కాపాస్ కిసాన్ యాప్ ద్వారా స్వీయ నమోదు చేసుకోవాలని తెలిపారు. తద్వారా పత్తి అమ్మకాలు సులభం అవుతుందన్నారు. కార్యక్రమంలో ఏఈఓ ఖలీల్, రైతులు పాల్గొన్నారు.

మంత్రి కొండా సురేఖను కలిసిన నాచగిరి పాలకమండలి



వర్గల్(గజ్వేల్): నాచగిరి ఆలయ మాస్టర్‌ప్లాన్ పునరుద్ధరణ, నిధుల మంజూరు చేయాలని కోరుతూ చైర్మన్ రవీందర్ ఆధ్వర్యంలో ఈఓ విజయరామారావు, పాలకమండలి సభ్యులు దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖను శనివారం కలిశారు. హైదరాబాద్‌లో ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి జ్ఞాపిక అందజేశారు. మాస్టర్‌ప్లాన్ పునరుద్ధరణతోపాటు, భక్తుల సౌకర్యం కోసం అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరారు. అయితే ఆమె సానుకూలంగా స్పందించారని చైర్మన్ తెలిపారు.

సొంత ఖర్చులతో పైపులైన్ ఏర్పాటు



పైపులైన్ పనులు చేస్తున్న స్థానికులు

చేర్యాల(సిద్దిపేట): గ్రామంలో మౌలిక వసతులు కల్పించాల్సిన అధికారులు, నేతలు పట్టించుకోకపోవడంతో మండల పరిధిలోని కమలాయపల్లి గ్రామస్తులు తమ సొంత ఖర్చులతో డ్రైనేజీ పైపులైన్ ఏర్పాటు చేసుకున్నారు. శనివారం వారు మాట్లాడుతూ గ్రామంలోని బీసీ కాలనీ గాంధీ చౌరస్తా నుంచి ఉన్న 20 ఇళ్లకు డ్రైనేజీ లేకపోవడంతో మురుగు నీరు రోడ్లపై పారుతోందన్నారు. ఈ విషయమై ఎన్నిసార్లు విన్నవించుకున్నా ఫలితం లేదని వాపోయారు. దీంతో తలా కొంత జమచేసి రూ.1.20 లక్షలతో పైపులైన్ ఏర్పాటు చేసుకుంటున్నట్లు తెలిపారు. కలెక్టర్ స్పందించి గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనపై దృష్టి పెట్టాలని కోరారు.

ఆడబిడ్డల ఆత్మగౌరవం 'బతుకమ్మ'

- ఘనంగా ముందస్తు సంబురాలు
- ఆడిపాడిన విద్యార్థినులు

జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం ముందస్తు బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. బతుకమ్మ పండుగ నేపథ్యంలో ప్రభుత్వం ఆదివారం నుంచి పాఠశాలలకు సెలవులు ప్రకటించింది. దీంతో చివరి రోజున విద్యార్థులు ఉత్సాహంగా వేడుకలు జరుపుకొన్నారు. తీరొక్క పూలతో బతుకమ్మను పేర్చి బతుకమ్మ ఆటలాడారు. తెలంగాణ ఆడబిడ్డలు ఆత్మగౌరవంగా జరుపుకొనే బతుకమ్మ పండుగ అని ఉపాధ్యాయులు పేర్కొన్నారు.



హుస్నాబాద్: డిగ్రీ కళాశాలలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు



దుబ్బాక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బతుకమ్మ సంబరాలు



మిరుదొడ్డి(దుబ్బాక): ఆరెపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల తల్లులు



చిన్నకోడూరు(సిద్దిపేట): రామంచ ప్రాథమిక పాఠశాలలో..



తొగుట(దుబ్బాక): చందాపూర్ పాఠశాలలో ..



హుస్నాబాద్‌రూరల్: పొట్లపల్లి పాఠశాలలో బతుకమ్మ ఆడుతున్న చిన్నారులు



గజ్వేల్‌రూరల్: ఆర్‌అండ్‌ఆర్ కాలనీలోని స్కూల్లో..



మిరుదొడ్డి(దుబ్బాక): భూంపల్లి పాఠశాలలో..



జగదేవ్‌పూర్ పాఠశాలలో..

కడవేర్గు పాఠశాలలో 'బాలచెలిమి'



బాలసాహిత్య గ్రంథాలు చూపుతున్న హెచ్ఎం రాజమణి తదితరులు

చేర్యాల(సిద్దిపేట): మండలంలోని కడవేర్గు పాఠశాలలో చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ ఏర్పాటు చేసిన బాలచెలిమి గ్రంథాలయాన్ని హెచ్ఎం రాజమణి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలల వికాసం కోసం బాలచెలిమి పేరుతో పత్రిక నిర్వహిస్తూ, అదే పేరుతో గ్రంథాలయాలు నెలకొల్పుతున్న చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ కృషి గొప్పదన్నారు. మారు మూల గ్రామాల్లో ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థుల సౌకర్యం కోసం రూ.10 వేల విలువగల పుస్తకాలతో గ్రంథాలయం ఏర్పాటు చేసిన అకాడమీ చైర్మన్ బాలచెలిమి సంపాదకుడుమణికొండ వేదకుమార్, కన్వీనర్ గరిపల్లి అశోక్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉపాధ్యాయులు రమేశ్, చంద్రశేఖర్‌రావు, కృష్ణమూర్తి, ప్రీతి, లింగాచారి, రామకృష్ణ, మమత, సాజిదా, అరుణ, సీఆర్పీ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ బాల సదనం సందర్శించిన న్యాయమూర్తి

సిద్దిపేటజోన్: జిల్లా కేంద్రంలోని బాల సదనాన్ని ప్రిన్సిపల్ సివిల్ జడ్జి మిలింద్ కాంబ్లే శనివారం సందర్శించారు. పిల్లలతో మాట్లాడి యోగక్షేమాలు తెలుసుకున్నారు. బాగా చదువుకోవాలని సూచించారు. అనంతరం చట్టాల గురించి వివరించారు. నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. సూపరింటెండెంట్ ప్రతిభ, సిబ్బంది రాజారామ్ తదితరులు పాల్గొన్నారు.

◆ అగ్నిమాపక కేంద్రం కోసం వినతి

చేర్యాల(సిద్దిపేట): పట్టణ కేంద్రంలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయంలో రెవెన్యూ అధికారి నాగమణికి శనివారం వినతిపత్రం అందజేశారు. అనంతరం జిల్లా కార్యవర్గసభ్యుడు అందె అశోక్ మాట్లాడుతూ అగ్నిమాపక కేంద్రం లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఆయన వెంట భూమయ్య, భాస్కర్‌రెడ్డి, కనకయ్య, మహిపాల్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

◆ పైతాన్ ప్రోగ్రామింగ్‌పై అవగాహన

సిద్దిపేటఅర్బన్: పొన్నాలలోని ఇందూరు ఇంజినీరింగ్ కళాశాలలో పైతాన్ ప్రోగ్రామింగ్‌పై శనివారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఏఐఎంఎల్ ఇంజనీర్, డాటా సైంటిస్ట్ సందీప్ హాజరై బీటెక్ విద్యార్థులకు బేసిక్ నాలెడ్జ్, అడ్వాన్స్ ప్రోగ్రామింగ్ గురించి వివరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వీపీ రాజు, పరశురాములు, రితీష్‌ఠాకూర్, నూరుద్దీన్ బాబా, చైతన్య, శిరీష, రఘు పాల్గొన్నారు.

◆ సేవా దృక్పథం అవసరం

గజ్వేల్‌రూరల్: విద్యార్థులు సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నిఖత్‌అంజుమ్ సూచించారు. కళాశాలలో ఎన్ఎస్ఎస్ వ్యవస్థాపక దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ గణపతిరావు, అధ్యాపకులు విజయభాస్కర్‌రెడ్డి, అలివేలు, రామచంద్రం, మహేందర్, పెద్దిరాజు పాల్గొన్నారు.

◆ సీజనల్ వ్యాధులపై అవగాహన

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని చిట్యాల గ్రామంలో శనివారం తెలంగాణ సాంస్కృతిక సారథి కళా బృందం సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించింది. కళాకారులు పిన్నింటి రత్నం, పిల్లిట్ల శ్యాంసుందర్ మాట్లాడుతూ ప్రజలు పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. కళాకారులు కనకయ్య, హరిప్రసాద్, శ్రీనివాస్, భిక్షపతి, సిద్ధులు, శైలజ తదితరులు పాల్గొన్నారు.

◆ ఉల్లికోడు నివారణ చర్యలు

తొగుట(దుబ్బాక): వరికి ఆశించే ఉల్లికోడు నివారణకు చర్యలు తీసుకోవాలని ఏఈఓ నాగార్జున రైతులకు సూచించారు. మండలంలోని పెద్ద మాసాన్‌పల్లి రైతు అల్వాల రాజిరెడ్డి వరి పంటను ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వరి పంట పొట్ట, కంకులు బయటకు వచ్చే దశలో ఉందని, అక్కడక్కడ ఉల్లికోడు ఆశించినట్టు గుర్తించామన్నారు. నివారణకు ఫిప్రోనిల్ 5శాతం, ఎస్‌సీ 205మిలీ చొప్పున లీటరు నీటిని కలిసి పిచికారీ చేసుకోవాలని సూచించారు.

◆ కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయండి

హుస్నాబాద్: అక్టోబర్ మొదటి వారంలోనే మార్కెట్ యార్డులో సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి రవీందర్‌గౌడ్ డిమాండ్ చేశారు. పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్రాలను సకాలంలో ఏర్పాటు చేయకుంటే దళారులే లాభపడతారన్నారు. రాజు, వెంకటేశ్, శంకర్, సుధాకర్, రాంబాబు పాల్గొన్నారు.

◆ కరపత్రం ఆవిష్కరణ

అక్కన్నపేట(హుస్నాబాద్): అంబేడ్కర్ యువజన సంఘం 49వ ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెప్యాల ప్రకాశ్ పిలుపునిచ్చారు. అంబేడ్కర్ చౌరస్తాలో శనివారం ఆయన ఆవిర్భావ దినోత్సవానికి సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. హనుమకొండ జిల్లాలోని అంబేడ్కర్ భవన వద్ద ఆదివారం జరిగే ర్యాలీలో పాల్గొనాలని కోరారు. ఎల్లయ్య, రమేశ్, సారయ్య, కార్తీక్, జగదీశ్, రాజు పాల్గొన్నారు.

◆ ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

నంగునూరు(సిద్దిపేట): రాజగోపాల్‌పేట పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం గ్రాడ్యుయేషన్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎన్వీడియా కంపెనీ ప్రతినిధి గంప బాకిష్‌గుప్తా విద్యార్థులకు పట్టాలు అందజేశారు. ప్రిన్సిపాల్ గోవర్ధన్, అధ్యాపకులు అభినవ్, సహబాజ్, రాజు, రామకృష్ణ, శ్రీనివాస్‌రెడ్డి, కమాల్ అహ్మద్, రాజమౌళి, కవిత, వైదేహి తదితరులు పాల్గొన్నారు.

◆ క్రీడా దుస్తులు పంపిణీ

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని చిలాపూర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పలువురు దాతల సహకారంతో శనివారం క్రీడా దుస్తులు, షూ, టై, బెల్టులు అందజేశారు. ఈ సందర్భంగా దాతలను సన్మానించారు. కార్యక్రమంలో హెచ్ఎం తిరుమలేశ్, రవీందర్, కవిత, చంద్రమౌళి, కవిత తదితరులు పాల్గొన్నారు.